క్లుప్తంగా

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన హన్సిక



శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన చల్లా సుజాత, సమ్మిరెడ్డిల కూతురు హన్సిక సోమవారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో దేశ స్థాయిలో 279వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. సీఆర్‌ఎల్ ర్యాంకు 2,926 వచ్చింది. హన్సిక జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.67 పర్సంటేజ్ సాధించింది. హన్సికను గ్రామస్తులు అభినందించారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన పెంబర్తి వినోద్ (అబ్బాస్) ఇటీవల పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న 2012–13లో వినోద్‌తో పదోతరగతి చదువుకున్న స్నేహితులు సోమవారం బాధితకుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. గణేష్, నవీన్, రమేశ్, రాజేందర్, వంశీధర్ తదితరులు ఉన్నారు.

రజకులను ఒకే కేటగిరీలో చేర్చాలి

ఐనవోలు : దేశవ్యాప్తంగా రజకులందరినీ ఒకే కేటగిరీలోకి మార్చాలని ఆలిండియా రజక సంఘం ఉపాధ్యక్షుడు ఉల్లెంగల యాదగిరి సోమవారం ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశంలో 8.45 కోట్ల రజకులు ఉన్నారని, ఒకే కులం, ఒకే వృత్తి, ఒకే దేశం, ఒకే ఓటు అంటున్నప్పుడు అందరూ ఒకటే కేటగిరీలో ఉండాలని కోరారు. 18 రాష్ట్రాల్లో రజకులు షెడ్యూల్ కులాలుగా ఉండగా, 12 రాష్ట్రాల్లో ఓబీసీలుగా ఉన్నట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రజకుల సమస్యలను గుర్తించి దేశంలోని రజకులందరిని ఒకే కేటగిరీ షెడ్యూల్ కులాల జాబితాలో ఉంచాలని డిమాండ్ చేశారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాదు నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం యూత్ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సముద్రాల సురేష్, ఉపాధ్యక్షుడిగా ఆకుతోట వెంకటేష్, కార్యదర్శిగా దాసి శివకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బైరి ప్రవీణ్, కోశాధికారిగా నర్ర నవీన్, కార్యవర్గ సభ్యులుగా ఎండీ చోటు, బొత్త అభిను ఎన్నుకున్నారు.

బాపూజీ పురుషుల పొదుపు సంఘం ..

మండలంలోని ప్రగతిసింగారంలో బాపూజీ పురుషుల పొదుపు సంఘం నూతన కమిటీని సోమవారం సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ ఉస్మాన్, ఉపాధ్యక్షుడిగా మోకిడే బాబురావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు ఉస్మాన్ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా 350 మంది సభ్యులతో రూ.78లక్షల నిధులతో సంఘం నడుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు ధర్మవతి, సమితి గణకులు రమణాచారి, పాలకవర్గ సభ్యులు ఎస్‌రెడ్డి హంసరెడ్డి, మోకిడే అమరేందర్, దేవనాడి మల్లాజి, తాటికంటి విద్యాసాగర్, కన్నోజు విజయరావు, రాజేశ్వర్ రావు, ఇటుకాల పాపరావు, ప్రేమ్‌సాగర్, బెజ్జంకి లింగమూర్తి, ఎస్‌రెడ్డి రవీందర్ రెడ్డి, సతీష్, మోతుకూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి



లచ్చమ్మ (ఫైల్)

నడికూడ : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారిపడి ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పరకాల పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గొల్లపల్లెకు చెందిన జీల లచ్చమ్మ (67) తన ఇంటికి ఎదుట ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో జారిపడటంతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సును ఢీకొట్టిన కారు

ఐనవోలు : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనక నుంచి కారు ఢీకొట్టిన సంఘటన మండలంలోని పంథిని గ్రామ పంచాయతీ వరంగల్–ఖమ్మం రహదారిపై జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికుల కోసం పంథిని బస్ స్టాప్ వద్ద ఆగింది. కాగా వెనక నుంచి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ఘటనతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. కారు ముందు భాగం ధ్వంసం కాగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పిల్లర్లకే పరిమితం

- ముందుకు సాగని హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణ పనులు
- పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్



పిల్లర్ల దశలో నిలిచిన హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు, (ఇన్‌సెట్‌లో) 2023లో ఏర్పాటు చేసిన శిలాఫలకం

ఆత్మకూరు : పేదలకు సంపూర్ణ వైద్యసేవలు అందించేందుకు మండల కేంద్రంలో హెల్త్ సబ్‌సెంటర్ మంజూరు చేశారు. ఇందుకు పాఠశాల భవనం శిథిలావస్థకు చేరగా అదే స్థలంలో నిర్మాణం చేపట్టారు.అయితే బిల్లులు మంజూరు కావడం లేదని కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్థానికులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్‌లో ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆరోగ్య ఉపకేంద్రం (హెల్త్ సబ్ సెంటర్) భవన నిర్మాణానికి 2023 పునాదులు వేశారు. ఏళ్లు గడుస్తున్నా ఈ భవన నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఎన్‌హెచ్‌ఎం నిధులతో సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులను రూ. 20లక్షల వ్యయంతో శిలాఫలకం ఏర్పాటు చేశారు.అయితే ఇప్పటివరకు పూర్తికాక పోవడంతో అద్దె భవనంలోనే కొనసాగుతోంది. హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు పూర్తయితే స్థానికులకు వైద్యసేవలు అందుతాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. హెల్త్ సబ్ సెంటర్‌కు నిత్యం రోగులు వైద్యం కోసం అధికసంఖ్యలో వస్తుంటారు. ఇరుకుగదిలో సరైన సౌకర్యాలు లేక డాక్టర్లతో పాటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలకు వ్యాక్సిన్లు, గర్భిణులు పరీక్షలకు ఇక్కడికే వస్తుంటారు. దీంతో అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి సబ్‌సెంటర్ నిర్మాణంపై దృష్టిసారించి నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

- ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : ఆదర్శప్రాయుడు అంబేడ్కర్ అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంబేడ్కర్ ఆశయాలు చిరస్మరణీయమని అన్నారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిదని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, నాయకులు బీరం సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పర్వతగిరి రాజు, కంచ రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లు పరికిరాల వాసు, బరుపట్ల కిరీటి, అయోధ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఖాజా, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని, రోడ్డును కాపాడండి



ఆర్డీఓకు ఫిర్యాదు అందజేస్తున్న రైతులు, గ్రామస్తులు

- ఆర్డీఓకు అంబాల రైతుల ఫిర్యాదు

కమలాపూర్ : మండలంలోని అంబాల నుంచి ఎలకతుర్తి మండలం కేశవాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న ప్రభుత్వ భూమిని, రోడ్డును అక్రమణదారుల నుంచి కాపాడాలని రైతులు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్, కమలాపూర్ తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్‌కు సోమవారం వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు మాట్లాడుతూ అంబాల–కేశవాపూర్ మార్గంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిలో గ్రామానికి చెందిన కొందరు రోడ్డును ఆక్రమించి ఇళ్లు, ప్రహరీ నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఆ రోడ్డు, వారు నిర్మించే ఇంటి స్థలం సర్వే నంబరు 506లోని ప్రభుత్వ భూమి అని, వారికి అక్కడ ఎలాంటి పట్టాలు, అనుమతులు లేవన్నారు. ఆ రోడ్డు గుండా వ్యవసాయ భూములకు, గుట్టకు, చెరువుకు, ఆలయాలకు, ముస్లింల దర్గాకు వెళ్లే మార్గం ఉందన్నారు. అక్రమణ నిర్మిణాల వల్ల రోడ్డు ఇరుకుగా మారి ట్రాక్టర్లు, వరి కోత మిషన్లు, గుట్టకు వెళ్లే లారీలు, పశువులు పోయే అవకాశం లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై 2020లో కమలాపూర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా కొద్ది రోజులు అక్రమ నిర్మాణాలను నిలిపివేయించి గుట్ట వెనక 80 ఫీట్ల రోడ్డుతో వ్యవసాయ గోదాములు నిర్మించడానికి సర్వే చేశారని, అది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో కెత్తె మొగిలి, రమేష్, సారయ్య, భద్రయ్య, రవి, రవీందర్, రాజ్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

పరకాల : పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, నూతన ఆవిష్కరణలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని పరకాల మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్- 2047లో భాగంగా నిర్దేశించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో సోమవారం పరకాల పట్టణంలో ప్రతి దినం ఒక చర్య–ఒక మార్పు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ప్రజల ఎదుట అనే విధానం ద్వారా పట్టణ అభివృద్ధిని 100 రోజుల ప్రణాళికలో అమలు చేయడమే లక్ష్యంగా నిబద్ధతతో అధికారులు, సిబ్బంది పాలుపంచుకోవాలని కమిషనర్ వెంకటేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఏఈ సీహెచ్ రంజిత్, జేఏడీ ఎండీ అర్షద్, ఆర్‌ఓ ఎ.రఘు, సీనియర్ అకౌంటెంట్ శ్రీనివాసరావు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.6,780 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

కమలాపూర్ : మండలంలోని అంబాల గ్రామానికి చెందిన ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. అంబాలలో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పేకాట స్థావరంపై సోమవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న అంబాలకు చెందిన బోయిని రవి, గందసిరి లింగమూర్తి, బోయిని శ్రీధర్, గందసిరి శ్రీనివాస్, ఉడుతనబోయిన రాజేందర్, బోయిని శ్రీనివాస్ అనే ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6,780 నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

నేటినుంచి 'భూ భారతి' సదస్సులు

కమలాపూర్ : మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో నేటినుంచి ఈనెల 18వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 3న మాధన్నపేటలో, 4న జూజునూర్, గూనిపర్తి, 5న అంబాల, గూడూరు, 6న గుండేడు, నేరెళ్ల, 9న కన్నూరు, భీంపల్లి, 10న ఉప్పల్, 11న దేశరాజుపల్లి, 12న శనిగరం, 13న వంగపల్లి, 16న కానిపర్తి, 17న మర్రిపల్లిగూడెం, 18న కమలాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకుని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కోరారు.

వేలేరులో..

వేలేరు : మండలంలోని 7 రెవెన్యూ గ్రామాల్లో నేటి నుంచి భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హెచ్.కోమి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న గుండ్లసాగర్, 4న మల్లికుదుర్ల, 5న సోడాషపల్లి, 6న పీచర, 9న కన్నారం, 10న ఎర్రబెల్లి, 11న వేలేరులో భూ భారతి సదస్సులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల్లో నేటినుంచి ఈ నెల19వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సదానందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న సోమదేవరపల్లి, 4న జానకిపురం, 5న ముప్పారం, 6న క్యాతంపల్లి, 9న నారాయణగిరి, 10న తాటికాయల, 11న దేవునూర్, 12న ధర్మాపురం, 13న పెద్దపెండ్యాల, 16న మల్లక్‌పల్లి, 17న ఉనికిచర్ల, 18న ఎల్కుర్తి, 19న ధర్మసాగర్‌లో సదస్సులు జరుగుతాయన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని 9 రెవెన్యూ గ్రామాల్లో భూ భారతి చట్టం–2025 రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విక్రమ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న పున్నేలు, 4న వనమాల కనపర్తి, 5న పంథిని, 6న వెంకటాపూర్, 9న నందనం, 10న నందనం రెవెన్యూ పరిధిలోని లింగమోరిగూడెం జీపీ కార్యాలయాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయి. 11న సింగారం, 12, 13వ తేదీల్లో రెండ్రోజుల పాటు కొండపర్తిలో, 16న కక్కిరాలపల్లి, 17న గర్మిళ్లపల్లి, 18, 19వ తేదీల్లో ఐనవోలు రైతు వేదికలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

పరకాల : మండలంలో నేటినుంచి రెవెన్యూ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న లక్ష్మీపూర్, 4న వెంకటాపూర్, 5న నాగారం, 6న పైడిపల్లి, 9న మల్లక్‌పేట, 10న రాజిపేట, 11న వెల్లంపల్లి, 12న పోచారం, 13న కామారెడ్డిపల్లె, 16న మాదారం(అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్),17న పరకాలలోని రైతు వేదికలో సదస్సులు ఉంటాయన్నారు.

'ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

వేలేరు : మండలంలోని కన్నారం శివారులో పలు సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూములను భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ హెచ్.కోమికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్నారంలోని ప్రభుత్వ భూములను కొంత మంది భూస్వాములు తప్పుడు పత్రాలు సృష్టించి పట్టాలు చేసుకుని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో సుమారు 100 కుటుంబాల వరకు గుంట భూమి లేని వారు ఉన్నారని వారికి ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాములు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వేల్పుల రవి, భూ పోరాట నాయకురాలు లక్ష్మి, మహంకాళి, సమ్మక్క, పుష్పాంజలి, సాగర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

- ఏఓ గంగాజమున



నవధాన్యాలను పంపిణీ చేస్తున్న ఏఓ గంగాజమున

శాయంపేట : వానాకాలంలో రైతులు తమ భూముల్లో నాటేందుకు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఓ గంగాజమున సూచించారు. సోమవారం మండలంలోని సూరంపేట గ్రామంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వాడకంపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గంగాజమున మాట్లాడుతూ.. రైతులు పంటలకు అధిక రసాయనాలు వాడడం వల్ల నేల, నీరు, గాలి, కాలుష్యంతో మానవుల ఆరోగ్యం కూడా పాడువుతుందని తెలిపారు. రైతులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసినట్లయితే ఆరోగ్యకరమైన పంటను తీసుకోవడానికి వీలవుతుందని, అధిక రసాయనాలు వాడడం వల్ల నేలలో చౌడు వచ్చే అవకాశం ఉందని వివరించారు.పురుగు మందు పిచికారీ చేసే సమయంలో రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని, బయోమందులను ఎట్టి పరిస్థితిలో వాడొద్దని తెలిపారు. రైతులు మొక్కజొన్న, వరిలో మేల్, ఫీమేల్ పద్ధతిలో పంటలు సాగుచేయడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలని తెలిపారు. రసీదుపై షాపు యాజమాని సంతకంతో పాటు రైతు సంతకం ఉండేలా చూసుకోవాలన్నారు. మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని, భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ప్రజ్వల్ సంస్థ ఆధ్వర్యంలో రైతుల కోసం తయారు చేసిన నవధాన్యాల మినీ కిట్స్‌ను రైతులకు ఆమె పంపిణీ చేశారు. నవధాన్యాల ద్వారా కలిగే ఉపయోగాలను వివరించారు. జీపీ సెక్రటరీ రాజ్‌కుమార్, ఫీల్డ్ ఫెసిలిటేటర్ కల్పన, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: జాతీయ జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి



ఐనవోలు: జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు మోహన్, చందర్‌రావు



శాయంపేట: పోలీస్ స్టేషన్‌లో..



ఘనంగా అవతరణ వేడుకలు



కమలాపూర్: జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేస్తున్న ఎంపీడీఓ బాబు



కమలాపూర్‌లో.. తహసీల్దార్ సురేష్, సిబ్బంది



వేలేరు: జెండాకు వందనం చేస్తున్న ఎస్సై సురేష్

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రభుత్వ, పార్టీ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు పలు యువజన సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరకాల: అమరధామం వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



పరకాల: కోర్టులో జడ్జి శాంతిసోని తదితరులు



వేలేరు: జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న తహసీల్దార్ కోమి, సిబ్బంది



ఎల్కతుర్తి: పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ప్రవీణ్‌కుమార్,సిబ్బంది



ఐనవోలులో.. తహసీల్దార్



ఆత్మకూరు: జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి



నడికూడ: జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీఓ విమల, పాల్గొన్న అధికారులు



ధర్మసాగర్: జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్



భీమదేవరపల్లి: జాతీయ జెండాను ఎగురవేస్తున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్

గులాబీ జెండా ఎగురవేసిన బీఆర్‌ఎస్ నేతలు





గంగిరేణి గూడెం, సూర్యనాయక్ తండా గ్రామాల్లో గులాబీ జెండాను ఎగురవేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శాయంపేట : తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని సూరంపేట, గంగిరేణిగూడెంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గులాబీ జెండాను ఎగురవేశారు. జాతీయ జెండాను ఎగురవేయాల్సింది పోయి గులాబీ జెండాను ఎగురవేయడం ఏంటని గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు.

రైతు సేవల్లో వ్యాపారస్తుల పాత్ర కీలకం

- తెలంగాణ రైతు ఋణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు



పరకాల : వ్యాపారంగానే కాకుండా రైతుల సంక్షేమం, సేవల్లో విత్తన, ఎరువుల వ్యాపారస్తులు పాత్ర చాలా కీలకమని తెలంగాణ రైతు ఋణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు.పరకాల పట్టణంలోని నూతనంగా ఎన్నికైన పరకాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం వేదమంత్రోచ్చరణలతో సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా నాగుర్ల వెంకటేశ్వర్లు హా జరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా గందె వెంకటేశ్వర్లు, కోశాధికారిగా శివాజీ, ఎర్ర లక్ష్మణ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులంతా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.